


# వృక్షవృత్తాంతం

**- లతిక...**

వృక్షం దు సొలవు సామెతలు చెప్పుకుందాం. సభ్య దేశాల మధ్య అసభ్యదేశా లుంటే వాటిని తులసి వనంలో గంజాయి మొక్క అంటారు. హోదాని బట్టి ఖర్చు వెచ్చాలుండాలని చెప్పడానికి ఎంత చెట్టుకి అంత గాలి అంటారు స్కాలర్ లేని చోట ప్యాను మార్కులవాడే గొప్పవా డనడానికి, మ్రాను లేని దేశమందాముదవు చెట్టే మహా వృక్షం అని ఉదహరిస్తారు. పార్టీ స్థాపకుల పేర్లు చెప్పుకుని వోట్లు అర్థిస్తే, చెట్టు పేరు చెప్పుకుని కాయ లమ్ముకోడంగా పరిగణిస్తారు.

ఇలా మన దైనందిన వ్యవహారాల్లో చెట్టు, పొదుకోల్పబడి, వ్రేళ్లు తన్నుకుని, శాఖలుగా విస్తరించి తన ప్రాముఖ్యతని వెల్లడించుకుంటున్నది.

వృక్ష వృత్తాంతం అంటూ సాముదాయిక నామధేయం పెట్టాను గనుక చెట్ల గురించి స్థూలంగా మనవిచేస్తాను. (సూక్ష్మపరిశీలన ప్రారంభిస్తే చెట్టుకో వ్యాసం తయారౌతుంది!')

పరమసాధ్వి సీత పద్నాలుగేళ్లు గాలి పీల్చి గడిపింది, అశోకవృక్షం క్రింద! భీష్ము డంతటి మహారథి రథకేతనమైంది తాళధ్వజం! దానిపేరిట అతడు తాళధ్వజుడైనాడు. "వృక్షాలలో అశ్వత్థాన్ని నేను" అన్నాడు గీతాకారుడు కాని అశ్వత్థం త్రిమూర్తులకే ప్రాతినిధ్యం వహించిందని క్రింది శ్లోకం ఋజువుచేస్తుంది

"మూలతో బ్రహ్మరూపాయ
మధ్యతే విష్ణురూపిణే
అగ్రత శ్శివ రూపాయ .."

దేవతలకి ప్రాతినిధ్యం వహించిన చెట్లు మానవులకు మహిమ లిచ్చేయి. గౌతముని, మునిగా, గౌతమబుద్ధునిగా మార్చింది బోధి వృక్షం! అజ్ఞాతవాస ప్రయాణం "మోర్ కంఫర్టబుల్" గా ఉండాలని 'లెస్ లగేజ్" తో ట్రావెల్ చేసిన పాండవులు, తమ ఆయుధాలు దాచుకుందికి క్లోక్ రూముగా ఉపయోగపడింది శమీవృక్షం!

క్రూరమృగాల బారినుంచి రక్షణకోసం చెట్టు నాశ్రయించాడు మానవుడు. అలా చెట్టెక్కడంలో హోసారి హో గమ్మత్తు జరిగింది. ఆ గమ్మత్తు యావత్తు యిది!

వేటకి వెళ్లిన భోజరాజు కొడుకు దారి తప్పేడు. పులి ఎదురైంది. పరివారం దూరమైంది. భయం చేరువైంది. చెట్టెక్కాడు. దానిమీదో ఎలుగుబంటి ఉంది. ముందు నుయ్యి, వెనక గొయ్యి. రాత్రి కావొస్తోంది. నిద్ర ముంచుకొస్తోంది. నిద్ర పడితే, నిద్రలో క్రింద పడితే, పడి పులివాత బడితే, నిద్ర దీర్ఘనిద్ర అవుతుంది. ఎలుగుబంటీ, రాజా కొడుకూ ఒడంబడికలు చేసుకున్నారు.

పడుకున్నవాళ్లు పడిపోకుండా రెండవవాళ్లు కాపుండాలని. రాజుకొడుకు పడుకున్నాడు. నిద్ర లేచాడు తన వంతు ప్రకారం ఎలుగు పడుకుంది. దాన్ని కిందకి తోసేస్తే తన మానాన తను పోతానని పులి పలికింది. రాజుకొడుకు ఎలుగును త్రోసివేయబోయాడు. కాని అది పడలేదు. శపించింది. రా కొ తన వాఙ్మయం మరిచిపోయి ససేమిరా అన సాగేడు .... .... అక్షరానికో శ్లోకంగా నాలుగ్గు శ్లోకాలు చదివి, అక్షర లక్షలు పుచ్చుకుని ససేమిరా మాన్పించాడు మహాకవి కాళిదాసు!

ఆ కాళిదాసే పూర్వాశ్రమంలో కూర్చున్న కొమ్మ నరుక్కున్న ప్రబుద్ధుడు. అజ్ఞానంచేత అతను కూర్చున్న కొమ్మ నరికితే, ఆగ్రహావేశాతిశయంచేత ఒక మహావృక్షాన్ని సమూలంగా పెళ్లగించాడు సమీర కుమారుడు భీముడు!

పరీక్షించి పరికిద్దాం (వెయిట్ అండ్ సీ)అన్న ధర్మజుని సిద్ధాంతంమీద అతనికి నమ్మకం లేదు. (పెరటిచెట్టు మందుకి పనికిరాదుకదా!) కీచకుడు, చైనా, పాక్‌లు మంచి మాటలతో లొంగరని, వాళ్ల దురాక్రమణ ఆదిలోనే అరికట్టాలని, మొక్కయి వంగనిది మ్రానయి వంగదనీ అతనికి బాగా తెలుసు. కాని, అతని ప్రతీకార ప్రయత్నం వెంటనే ఫలించనివ్వలేదు ధర్మరాజు తాత్కాలికంగా భీముని ఉద్ధతి చెట్టెక్కింది చేసినపని నెరవేరితే 'ఫలించడ' మనీ, కాకపోతే 'చెట్టెక్కడ' మనీ అనడం మీరు వినే ఉంటారు.

చెట్టెక్కడం అన్న ప్రయోగం ఎలా పుట్టిందో తెలుసా? బేతాళ పంచవింశతి చదవండి. బేతాళుడు ఇరవైనాలుగు కథలు చెప్పి, కథకో ధర్మసందేహం అడిగేవాడు. విక్రమార్కుడు చెప్పేవాడు. మౌన భంగం కాగానే బేతాళుడు చెట్టెక్కేవాడు. అలా విక్రమార్కుడు పన్నెండు మార్చిలు, పన్నెండు సెప్టెంబరులు చూశాడు. ఇరవై అయిదోసారి 'చెట్టు ముందా, విత్తు ముందా' లాటి ఆద్యంతాలు తెలీని ప్రశ్న వేశాడు బేతాళుడు విక్రమార్కుడు మౌనం వహించాడు. రిజల్ట్సు పేపర్లో వేశారు. అందులో విక్రమార్కుడి నెంబరు ఉంది, (ఉత్తీర్ణులైనవారి జాబితాలో!)

కాలేజీలు తెరిచేలోగా విక్రమార్కుడు చెట్ల గురించి రిసెర్చ్ చేశాడు. రామాయణం, భారతం, భాగవతం కల్పవృక్షాలని, వాటి ఛాప్టర్స్‌ని క్రమంగా కాండలని, పర్వాలనీ, స్కంధాలనీ వృక్షభాగాల పేరిట పేర్కొన్నారని తెలుసుకున్నాడు.

చిన్నయసూరి సాహిత్యం చదివి నోట్సు రాసుకున్నాడు, ప్రపంచం వృక్షమే అయినా, మంచివాళ్ల చెలిమి, మంచి పుస్తకాల కలిమి అమృత ఫలద్వయమని తెలుసుకుని,

"విషభరితమైన సంసార వృక్షమునకు
వెలసె మధుర సుధాతుల్య ఫలయుగమ్ము,
ప్రముఖ కావ్యామృతపు రసపాన మొకటి
సార్థకమ్మగు సజ్జన సంగ తొకటి."

—అని, పద్యంగా నోట్ చేసుకున్నాడు!

తరు పరిశోధన వ్యాసాలకి అతనికి డాక్టరేట్ యిస్తే, ఆ వ్యాసాంశాలు పత్రికలు సీరియల్‌గా ప్రచురిస్తాయి. తక్కిన విశేషాలు అప్పుడు తెలుసుకుందాం!

★